# దురభిమానులు!

## ఏ. వి. మోహన్రావ్

"ఆరు లీటర్లుపొయ్యి!" అన్నాడు కారులోవున్న డ్రైవరు.

"డీసెలా? పెట్రోలా?" అడిగాడు ఆనందరావు.

"ఇది అంబాసిడర్ కారు! కనపడటంలా?" వెక్కిరింపుగా అన్నాడు కారు డ్రైవరు.

అతనితో వాదనకు దిగకుండా పెట్రోలుపోసి, టాంక్ మూత బిగించి, డబ్బులు అందుకున్నాడు. మేనేజరు దగ్గర బిల్లు తీసుకుంటూ గోడ గడియారంకేసి చూశాడు. పదయింది.

బిల్లు డ్రైవరుకిచ్చి, డ్రమ్ములోవున్న నీళ్ళలో చేతులు కడుక్కొని, రుమాలుతో తుడుచుకుంటూ వెళ్ళి "సార్! పదయింది! ఇంక వెళ్తాను." అన్నాడు ఆనందరావు.

"ఏంటోయ్! ఇంటి దగ్గర పెళ్ళాం నీకోసం ఎదురు చూస్తున్నట్లు అలా తొందరపడతావెందుకు? ఎదురు చూసే పెళ్ళామున్నా, ఇక్కడ నేను కూర్చోలా?" అన్నాడు మేనేజరు.

"అది కారు సార్! కొద్దిగా పనుంది. అవసరమైతే రేపు ఓవర్ టైమ్ చేస్తాను లెండి!" అన్నాడు ఆనందరావు.

"అయితే వెళ్ళు!" అన్నాడు మేనేజర్.

"ఈ వారం జీతం ఇవ్వనేలేదు।" నసుగుతూ నిల్చున్నాడు ఆనందరావు.

"ఈ వలభై పట్టుకెళ్ళు. లెఖ చూచి రావలసి వుంటే మిగిలింది రేపిస్తాను." అన్నాడు.

ఆనందరావు ఆ కాగితాలు అందుకుని ఈల వేసుకుంటూ రోడ్ పైకి వచ్చాడు. అదే టైముకు అతనికి కావలసిన బస్సువచ్చి ఆగింది. తక్కున ఎక్కి కూర్చున్నాడు.

అతని కళ్ళముందు సినీతార 'సితార' రూపం మెదిలింది. బంగారంతో శృంగారం రంగరించి, అంగాంగాలు, అతి లావణ్యంగా మలిచినట్లనిపించింది. ఆమె కళ్ళు తేనె రంగులో వుంటాయని ఒక పత్రిక రాసింది. వాటికేసి ఒక్కమారు చూస్తే, ఎదుట మనిషి శరీరంలో కొన్ని కోట్లు కిలోవాట్ల విద్యుత్తు పుట్టుకొస్తుందని మరో విలేఖరి చమత్కరించాడు. ఆమెకు నడుము లేదని కొందరు, వుందని మరి కొందరు, ప్రారంభించిన వాదులాట, ఇంకా తెగి తెల్లవారలేదనీ, ఈ పాయింటుపై మా పత్రిక దేశమంతా రెఫరెండమ్ పెట్టాలనుకుంటున్నదని, ఒక పత్రిక ఎడిటర్ రాశారు.

సితార నటించిన ప్రతి సినిమా రెండు వందల రోజులు ఆడి తీరుతున్నది. ఆమె సినిమాల్లో ప్రవేశించింది మొదలు ఇప్పటిదాకా, జరిగిన ప్రతి సంఘటన, పత్రికల్లో ప్రచురించిన ప్రతిఫోటో, ఆనందరావు దగ్గర వున్నాయి. సితార గురించి, ఆమెకే తెలియనన్ని వివరాలు, ఆనంద

రావు దగ్గర వున్నాయంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

"మిస్టర్! ఐస్‌హావుస్ వచ్చేసింది!" అన్నాడు కండక్టరు ఆనందరావును తట్టి వూపుతూ.

ఆనందరావు చటుక్కున లేచి, గబగబ బస్సు దిగాడు.

మెల్లగా నడుచుకుంటూ తను అద్దెకు తీసుకున్న చిన్న గుడిసె చేరుకున్నాడు. తలుపులా అడ్డువున్న తడికకు పెట్టిన తాళంకప్ప తొలగించి లోనికి వెళ్ళాడు.

మట్టిగోడలనిండా, సందు లేకుండా అతికించివుంచిన, 'సితార' బొమ్మలు చూడగానే, అతని ఒళ్ళంతా మత్తుతో నిండిపోయింది. ప్రతి బొమ్మలోంచి ఆమె, అతన్నే చూస్తున్నట్లుగా ఫీలయినాడు.

ఆ బొమ్మల బదులు, ఆమె నిజంగా తన్ను ఆప్యాయంగా, చూసేరోజు ఎప్పుడొస్తుందో ననుకుంటూ, చిన్న రేకుపెట్టె తీసి, అందులోవున్న ఖరీదైన, పాంటు, చొక్కా వెలుపలకు తీసి, వేసుకున్న ఆయిల్ మరకలైన బట్టలు విప్పి, వాటిని ధరించాడు. నీట్‌గా తయారై, పెట్రోలుబంకులో తెచ్చుకున్న నల భైరూపాయలు జేబులో వేసుకుని, మళ్ళీ వీధిన పడ్డాడు.

## 2

'ఫోర్ ఆటీన్స్'హోటలులోకి అడుగుబెట్టాడు ఆనందరావు.

ఒక డాన్సర్ దాదాపు బట్టలన్నీ విప్పేసి, టేబుల్సు మధ్య పాట పాడుతూ, తిరుగుతూంది.

ఆనందరావు ఖాళీగావున్న టేబులుకోసం చూశాడు. ఎక్కడా కనుపించలేదు. మూలగా వున్న టేబులువద్ద

ఇద్దరు మనుషులు కూర్చొని వున్నారు. వాళ్ల మధ్య పొడువు పాటి బ్రాందీసీసా వుంది. అందులో సగం ఖాళీ అయి వుంది. ఆనందరావు ఆ టేబులువద్దకు వెళ్ళి "మీకు అభ్యంతరం లేకుంటే!" అన్నాడు ఖాళీగా వున్న కుర్చీ చూపిస్తూ.

బట్టతల వున్న వ్యక్తి, పెదాల నడుమనున్న డ్రింకు గ్లాసు తీసి క్రిందపెడుతూ "కూర్చోండి!" అన్నట్లు చేత్తోనే సైగచేశాడు.

బేరర్ వచ్చి నిలుచున్నాడు. ఆనందరావు చెప్ప బోయేంతలో, "మరో గ్లాసు పట్రా!" అన్నాడు బట్టతల వ్యక్తి.

"నేను ఆర్డర్ చేస్తాను!" అన్నాడు ఆనందరావు.

"ఫరవాలేదు. మనం టేబులుమేట్సు మిప్పుడు." అన్నాడు అతను.

అందరూ కలసి ఒక రౌండ్ పుచ్చుకున్నారు.

"ఇవాళ షో ఎన్నిగంటలకు తెలుసాండి?" అడిగాడు ఆనందరావు తనకు సీటు ఆఫరుచేసిన వ్యక్తిని.

"ఏం షో?" అర్థంగానట్లుగా అడిగాడు.

"మీకు తెలీదా? ఇక్కడ బ్లూ ఫిలింషోస్ వారాని కొకసారి జరుగుతుంటాయి."

"అరె మాకు తెలీదే!" ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

అంతలో బేరర్ వచ్చాడు.

బట్టతల వ్యక్తి బేరర్ను అడిగాడు షో గురించి. అతను మెల్లగా చెప్పాడు ఇంకో గంటలో పైనున్న హాల్లో వేస్తారని.

"మిస్టర్! నీ పేరేమన్నావ్?" అడిగాడు ఆనంద రావును బట్టతల వ్యక్తి.

ఆనందరావు అతన్ని గురించి వివరాలు చెప్పాడు.

"నా పేరు డేవిడ్! కాన్ల బ్రోకరుగా వున్నాను. ఇతను నా ఫ్రెండు జేమ్స్. ఇంతకుముందు ఆర్మీలో పని చేశాడు. ఇప్పుడేదో తంటాలుపడుతున్నాడు" అన్నాడు బట్టతలవ్యక్తి.

డేవిడ్ కొంత సాధువులా కనిపించాడు. జేమ్స్ మొహం, కళ్ళు చేతులు సిగరెట్ తాగే తీరూ అన్నీ చూస్తే. అతను అన్నింటికీ తెగించినట్లుగానూ, ఎంత ఘోరమైనా చెయ్యటానికి వెనకాడనట్లూ అనిపించింది ఆనందరావుకి.

"బ్లూ ఫిలిం షోలో హీరోయిన్ ఎవరు?" అడిగాడు జేమ్స్.

"తెలీదు!" అన్నాడు ఆనందరావు.

"ఏం సినిమా తార సితారను కున్నానా?" అడిగాడు బట్టతల వ్యక్తి.

"ఆమె గనక అయితే, ఆ రీల్ మొత్తం మనం కాజెయ్యాలి." అన్నాడు జేమ్స్.

"మీరు 'సితార' అభిమానులా?"

"అంతా ఇంతా కాదు. మావాడు లక్షరూపాయలు దొంగతనంచేసైనా సంపాయించి, ఒక్క రాత్రి సితారతో గడపాలని చూస్తున్నాడు. ఏమయినా అందం అంటే ఆమెది. అటువంటి మనిషి ఇంతకు ముందు పుట్టలేదు. ఇక ముందు పుట్టదు." అన్నాడు డేవిడ్.

"మీ కొక్కడా ఆవిడంటే అభిమానమా?" అడిగాడు ఆనందరావు.

"నాకు పెళ్ళయింది. ప్రతిరోజూ, నా భార్యనే సితారనుకుంటూ ఆనందిస్తుంటాను. అంతటితోనే తృప్తి పడుతున్నాను." అన్నాడు డేవిడ్.

తనతో సితారను ఆరాధించే మరో ఇద్దరు వారికి దొరికినందుకు ఆనందరావుకు సంతోషం కలిగింది.

"డేవిడ్ గారూ? మీరు సితారను ఎప్పుడన్నా చూశారా?" అడిగాడు ఆనందరావు.

"చాలాసార్లు చూశాను. సినిమాల్లో" అన్నాడు.

"నేనూ అంతే!" వంతపాట పాడాడు జేమ్స్.

"ఆమెను అనుభవించాలన్న కోరికుందా మీకు?" అడిగాడు ఆనందరావు.

"కోరికయితే వుంది. కానీ ఏం లాభం? కుదురుతుందా? డబ్బెంతయినా ఖర్చుపెట్టగలను" అన్నాడు డేవిడ్.

"ఇందులో డబ్బు ప్రమేయంలేదు. డబ్బుకు అమ్ముడు పోవలసిన అవసరం ఆమెకులేదు. ఆమె దగ్గర అది కుప్పలు కుప్పలుగా పేరుకుపోయివుంది." అన్నాడు ఆనందరావు.

"అయితే మార్గం ఏమిటి?" అడిగాడు జేమ్స్.

"ఈ మధ్య స్టేట్మెంట్లో మీరు గమనించలేదనుకుంటాను. ఆమె వివాహం ఫలించలేదు. ఆరునెలలు అవకముందే ఆమె భర్తను వదలివేసింది. అతను డబ్బును మాత్రమే ప్రేమిస్తున్నాడన్న విషయం తెలుసుకొంది. వ్యక్తిగా, ఆమెను ప్రేమించే మనుషులకోసం, వాతావరణంకోసం తపించి పోతుంది. ఎవ్వరికీ చెప్పకుండా, ఎవ్వరికీ తెలీకుండా, ఎటో వెళ్ళిపోయి, మామూలు మనిషిలా కొన్ని దినాలు కాలం వెళ్ళబుచ్చాలన్న కోరిక కూడా పత్రికాముఖంగా తెలియపరచింది__సితార." అన్నాడు ఆనందరావు.

"ఆమె గురించి బాగా స్టడీచేసినట్లున్నావ్?"

"ఆమె నా ఆరాధ్య దైవం! నా దగ్గర ఆమెకు సంబంధించిన వివరాలు ఎన్నోవున్నాయి."

"అయితే ఆమెను మనం పొందడం ఎలా వీలవుతుం దంటావ్?" అడిగాడు జేమ్స్.

"నేను పెట్టేకొన్ని నిబంధనలకు మీరు ఇద్దరూ ఒప్పు కుంటే పథకం తర్వాత వివరించి చెపుతాను," అన్నాడు ఆనందరావు.

"ఏమిటవి?"

"రేపు రాత్రికి బీచ్‌కి రండి! అక్కడ మాట్లాడు కుందాం!" అన్నాడు ఆనందరావు.

అంతలో బేరర్ వచ్చి 'షో'కు టైమైందని చెప్పాడు. ముగ్గురూ లేచి వెళ్ళారు.

# 3

ఆనందరావు గదిలో కూర్చుని ఆలోచించసాగాడు. పరిచయంలేని క్రొత్త మనుషులతో, ఇలాటి వ్యవహా రంలో కుమ్మక్కు కావడం ఎంతవరకు మంచిదో అతనికి అర్థంగా లేదు.

సితారకు సంబంధించిన కొన్ని ఫైళ్ళు వెలికితీసి, పేపర్లలో ప్రచురించిన ఆమె ఉపన్యాసాలు మళ్ళీ చదివాడు.

ఆమె క్రొత్త బంగళా కొనుక్కొని గృహప్రవేశం చేసిన నాటి పత్రికలు కొన్ని తీసి, అందులో ఇంటి గురించి రాసిన వివరాలు చదివాడు. ఆమె దినచర్య మొత్తం ఒక కాగితంపైన నోట్ చేసుకున్నాడు.

బాగా చీకటి పడ్డాక, లేచి, నడక మొదలెట్టాడు బీచ్ వైపుకు.

మెరీనా కాంటీన్ వెనక వైపునున్న, సరుగుడు చెట్ల క్రింద కూర్చునివున్న డేవిడ్, జేమ్స్ కనుపించారు. వెళ్ళి వాళ్ళ దగ్గరగా కూర్చున్నాడు.

"రావేమో ననుకున్నాం!" అన్నాడు డేవిడ్.

"ఎందుకు?"

"ఇలాంటి విషయాల్లో భాగస్తులుండటం కొంతమందికి నచ్చదు." జేమ్స్ చెప్పాడు.

"అదీ నిజమే! కానీ భాగస్తుల్ని చేర్చుకునేందుకు కొన్ని కారణాలున్నాయి." అన్నాడు ఆనందరావు సిగరెట్ తీసి అంటించుకుంటూ.

"నీ పథకం వివరిస్తావా?"

"ఆఁ! కానీ ముందు మనం పాటించవలసిన నియమాలు చెబుతాను."

"చెప్పు!"

"సితారను మనం కిడ్నాప్ చేస్తాం. ఆమె తనకు తను ఇష్టపడి, మనతో సహకరిస్తే తప్ప, ఆమెను అనుభవించకూడదు. ఆమెకు ఏ పరిస్థితుల్లోనూ ఎలాంటి హాని మనం తలపెట్టకూడదు. ఆమె మన కస్టడీలో వున్నంత కాలం అవసరమయిన అన్ని సదుపాయాలు, మనం చేకూర్చాలి."

"ఆమె సహకరించకపోతే..." అడిగాడు జేమ్స్.

"ఎలా తెచ్చామో ఆమెను అలా వదిలెయ్యాలి."

"ఆ మాత్రానికి ఎందుకీ వృథా ప్రయాస. నయాన నచ్చ చెప్పుదాం. ఒప్పుకుంటే సరే! అలా గాకుంటే బలవంతంగానైనా మనకోరిక మనం తీర్చుకోవాలి. అలా కానప్పుడు ఈ పథకం అంతా అనవసరం," అన్నాడు జేమ్స్.

"మనం మామూలు మనిషితో వ్యవహరించడంలేదు. ప్రఖ్యాత సినిమా తారతో. ఆమెకుడబ్బు, అంతస్థు, అధికారం, పలుకుబడి అన్నీ వున్నాయి. ఆమెను నొప్పించి వదిలా మనుకుందాం. మన అంతు చూచేందుకు అవసర

మైన అన్ని యేర్పాట్లు చెయ్యగలవాము. అలాటి స్థితి తెచ్చుకో కూడదు." అన్నాడు ఆనందరావు.

"అంత మాత్రాన ఆమెకు మనపైన కోపం వుండ దంటావా?"

"వుండదు."

"నీ ఊహ ప్రకారం ఆమె మనతో సహకరిస్తుందా?" అడిగాడు డేవిడ్.

"సహకరిస్తుంది. నాకు నమ్మకం వుంది." అన్నాడు ఆనందరావు.

"ఆ నమ్మకానికి కారణం."

"ఆమె ప్రస్తుత మానసిక స్థితి. ఆమెకు మనలాంటి మామూలు మనుషులతో స్వేచ్ఛగా, ఆనందంగా, కొద్ది రోజులన్నా గడపాలని వున్నట్లు పదేపదే పత్రికల్లో ప్రకటనలు చేస్తూంది. అది చాలు!"

"ఈ దేశంలో మనల్ని మించిన మామూలు మనుషులు కొన్ని కోట్లమంది వున్నారు. మనతోనే గడపాలని ఆమెకు వుందని, నువ్వెలా ఊహిస్తున్నావ్?" అడిగాడు జేమ్స్.

"మనతోనే గడపాలని ఆమె కుందని నే చెప్పలేదు. మనం రిస్క్ చేసి ఆమెను, ఆ కృత్రిమ వాతావరణంలోంచి ఆమె యిష్టాయిష్టాలతో పనిలేకుండా పట్టుకొచ్చి, మామూలు మనుషుల్ని, పరిస్థితుల్ని చూపిస్తాం.

ఒకటి రెండు రోజులు ఆమె క్రొత్త వాతావరణానికి అలవాటు పడలేక తన్నుకుంటుంది. మనపైన కోపంగా వుంటుంది. ఆ తర్వాత ఆమెకై ఆమె మారిపోతూంది. అలా ఆమెలో మార్పువచ్చిందాకా మనం మంచి మనుషుల్లా, ఎదురుచూస్తాం. ఆమె పైని దౌర్జన్యంచేసే అవకాశం

వుండీ, మనం అలా ప్రవర్తించక పోవటంతో, మన మంచితనం ఆమెకు అర్థమవుతుంది- ఆ తర్వాత మనకు ఆమెపై ఎంత ఆరాధనా భావం వుందో గ్రహించ గలుగుతుంది.'' అన్నాడు ఆనందరావు.

''ఇదేదో కథలా రాసుకునేందుకు బాగుంటుందను కుంటాను.'' అన్నాడు జేమ్స్.

''అలా కొట్టిపారెయ్యకు. అతను చెప్పేది కూడా బాగానేవుంది.'' అన్నాడు డేవిడ్.

''అలా ఆమె సహకరించకపోతే ఆమెను వదిలెయ్యాలి. ఆమెను ఇన్నేళ్ళనుండి ఆరాధించిన వ్యక్తిగా, నా కళ్ళ ముందామెకు యే విధమైన అన్యాయం జరగడం నేను సహించను. ఇందుకు మీ రిద్దరూ ఒప్పుకుని నాకు చేతిలో చెయ్యివేసి ప్రమాణం చెయ్యాలి.''అన్నాడు ఆనందరావు.

వాళ్ళిద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఆ తర్వాత ఆనందరావు చెప్పినట్లే ప్రమాణం చేశారు.

''ముందుగా మనం సిటికీ దగ్గర్లో, ఎక్కడైనా నిర్మా నుష్యంగావున్న ప్రాంతాల్లో, మనం వుండడానికి వీలుగా వుండే ఒక చిన్న యిల్లులాంటిదేదన్నా చూసుకోవాలి. తర్వాత ఒక కారు సంపాదించాలి. ఓ వారం రోజులకు సరిపోయే ఆహారం, బట్టలు, మొదలైనవి సమకూర్చు కోవాలి'' అన్నాడు ఆనందరావు.

''ఇంటిది ప్రాబ్లంగాదు. నా ఫ్రెండొకతను మహా బలిపురం వెళ్ళేదోవలో,ఒక తోట కొన్నాడు. అందులో ఒక చిన్నబంగళావుంది. అందులో అన్నివసతులున్నాయి. అయితే అక్కడో వాచ్ మెన్ వున్నాడు. వాడ్ని ముందుగా పంపించెయ్యాలి. ఆ ఏర్పాట్లు చూస్తాను. రెండోది కారు. నాకో కారువుంది. అది సరిపోతుం

దనుకుంటాను.మిగిలిన విషయాలకు డబ్బుంటే చాలు.'' అన్నాడు డేవిడ్.

''నా దగ్గర డబ్బేమీ లేదు!'' అన్నాడు ఆనందరావు.

''అప్పుడే అనుకున్నాను''అన్నాడుజేమ్స్‌వ్యంగ్యంగా.

''ఏమని?''

''ఉండదని. లేదుగాబట్టే మమ్మల్ని భాగం కలుపు కుంటున్నావ్. పెట్టుబడిపెట్టని వాళ్ళను వర్కింగ్ పార్ట నర్స్ అంటారు. వాళ్ళకు నష్టాలతో పనిలేదు. లాభంలో నే భాగం వుంటుంది. దీనిపైన మేము పెట్టే డబ్బుకు తగిన ఆదాయం రాబట్టుకోనడం మా విధి. అందువల్ల నిబంధనలు పెట్టే హక్కు నీకు లేదనుకుంటాను.'' అన్నాడు జేమ్స్.

''అయితే మళ్ళీ మనం మొదటికి వచ్చాం.''అన్నాడు ఆనందరావు.

డేవిడ్ కలుగ చేసుకుంటూ ''జేమ్స్ మాటల పట్టించు కోవద్దు. మేము మనుషులం ఇద్దరం కావచ్చు, కానీ నా మాటే అతనిమాట. నువ్వు చెప్పినట్లే కానీ. ఇంతకూ యే మాత్రం ఖర్చవుతుంది?''

''దాదాపు పదివేలు కావచ్చు.''

''నువ్వెంత పెట్టుబడి పెడతావ్?''

''నా దగ్గర డబ్బులేదు. చెప్పాను కదా!''

''అది లేకుండానేనా ఇన్ని ఆలోచనలూ...'' వెక్క సరిగా అన్నాడు జేమ్స్.

''నా దగ్గర డబ్బు లేకున్నా ఈ పథకం తయారు చేయడానికి నేను వెచ్చించిన కాలం, సంపాదించిన సమా చారం చాలవా? అవి లేకుండా ఏం చెయ్యగలుగుతాం?'' ఎదురు ప్రశ్న వేశాడు ఆనందరావు.

''అనవసరపుచర్చ అవసరంలేదు. నీ దగ్గర డబ్బులేదు. మొత్తం మేము పెట్టాలి! అంతేనా?'' అడిగాడు జేమ్స్.

"అంతే!"

"అయితే నాదొక కండిషను. సితార మన చేతుల్లో చిక్కాక ఆమె మనలో ఎవరితోనన్నా వుండి పోదలచు కుంటే ఆ అవకాశం మొదట నాకివ్వాలి. నన్ను కాదన్న తర్వాతే మీ ఇద్దరూను. అదీగాక, ఆమె మీలో ఎవర్న న్నా కోరుకున్నా, నాకు ఇష్టమైనప్పుడు ఆమెను అను భవించే హక్కు నాకుండాలి! ఏమంటారు?" అడి గాడు డేవిడ్.

ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

"ఆమె పతివ్రత కాదు! కన్నెపిల్ల కాదు!! ఆ విషయం మీ ఇద్దరికీ తెలుసు. అలాంటప్పుడు మీరు నాకీ ప్రమాణం చెయ్యడంలోని ప్రమాదం యేమిటో అర్థం కావటం లేదు!" అన్నాడు డేవిడ్.

"అలాగే! నాకు అభ్యంతరంలేదు!" అన్నాడు జేమ్స్.

"నాకు అభ్యంతరం వుంది." అన్నాడు ఆనందరావు.

"ఎందుకని?" అడిగాడు డేవిడ్.

"ఆమె చరిత్ర ఎటువంటిదైనా, నన్ను కావాలను కున్న క్షణంనుంచి, ఆమె నా భార్య అవుతుంది. అందు వల్ల నువ్వు కోరిన విధంగా నేను హామీలు ఇవ్వడం వీలు కాదు. మన ప్రయత్నం మానివేద్దాం!" అన్నాడు ఆనందరావు.

"ఇందులో రాజీకి యే విధమైన ఆస్కారంలేదు!" అన్నాడు డేవిడ్.

"అదే నేను చెప్పేది కూడా!"

"అయితే మనం ఎందుకు టైం వేస్టుచేస్తున్నాం. వెళ్ళి పోదాం పద!" అన్నాడు జేమ్స్.

ముగ్గురూ లేచారు.

మాటా పలుకూ లేకుండా ఇసుకలో నడుచుకుంటూ లైట్లవేపు సాగిపోయారు.

## 4

"వీడికి బుర్ర చెడిపోతుంది!"! అన్నాడు జేమ్స్, ఆనంద రావు బస్సెక్కి వెళ్ళిపోయాక.

"అలా ఎందు కనిపించింది?"

"లేకుంటే 'సితార'ను లేవదీసుకు పోవడమేమిటి? ఆమెను మనం అందుకోగలమా?"

"అందుకో లేమా?"

"ఆమె చుట్టూ రకరకాల కుక్కలు, వాట్నిమించి నమ్మకంగా ఆమెను అనుక్షణం కాపాడుకునే మనుషులు, దాన్నిమించి రక్షణ కల్పించే కోటకు మించి డబ్బూ, యిన్నివున్నాయి మనకు అడ్డుగా. అసలు ఆమెకు గజం దూరందాకా వెళ్ళగలమాని సందేహం!" అన్నాడు జేమ్స్.

"సితార గురించి ఆ ఆనందరావు చాలా పరిశోధన చేశాడు. పకడ్బందీగా ప్లాను తయారుచేశాడు. ఆమెను అనుభవించడం నా కోరిక కాదు. ఎంత అందకత్తెయినా ఆమెకూడా ఆడదే! నాకు ఆడవాళ్ళలో పెద్ద భేదం కనుపించదు" అన్నాడు దేవిడ్.

"అయితే ఇంతదాకా అతనితో ఎందుకు మాట్లాడావ్?"

"దానికీ కారణం వుంది. మనం చిల్లర దొంగతనాలు, స్మగ్లింగులు చేస్తున్నాం. మనం సంపాదించే డబ్బుకన్నా, కటకటాలు తప్పించుకునేందు కిచ్చుకునే మామూళ్ళు ఎక్కువగా వున్నాయి. అందువల్ల, మన దరిద్రం తీరేలా యేదైనా పెద్ద పథకం వెయ్యాలి. అది దృష్టిలో వుంచుకునే యింత సేపూ మాట్లాడాను" అన్నాడు దేవిడ్ పైప్ తీసి వెలిగిస్తూ.

"గురువుగారు పెద్ద ప్లాను వేశారన్నమాట."

"అవును?"

"వివరంగా చెప్పండి. విని ఆనందిస్తాను."

"ఆనందరావు చెప్పిందాని ప్రకారం, నిజంగా సితారను మనం ఎగరేసుకు రాగలిగితే, ఆ తర్వాత కోరినంత డబ్బు రాబట్టుకోవడం పెద్ద విచిత్రంగాదు!" అన్నాడు డేవిడ్.

"అంటే ఆమె మన చేతికి చిక్కాక, బేరానికి దిగుతావన్నమాట!" అడిగాడు జేమ్స్.

"అవును!"

"అయితే అతన్ని మధ్యలోనే పంపావెందుకు? అతను చెప్పినట్లు చేసివుంటే పోయేది కదా?"

"అలా పోకూడదు. మనల్ని గురించి అతనికింకా తెలీదు. అతను చెప్పిందానికల్లా తల వూపితే, మనం వేరే ఆలోచనలో వున్నామన్న అనుమానం అతనికి రావచ్చు. అందువల్ల ఆమె శరీరంపైన, అందంపైన, అతనిలా మనకూ తీరని కోరిక వుండటంవల్లే అతనితో జట్టు కలిశామన్న నమ్మకం కలగాలి. అది కలిగించాలంటే ఇంతకన్నా వేరే మార్గం లేదు" అన్నాడు డేవిడ్.

"మరి అతని పథకం తెలుసుకోకుండానే అతన్ని దూరంగా తరిమేశావుగా?"

"అది చిన్న నాటకం. రెండ్రోజులు ఆగి చూద్దాం. నేను పెట్టిన షరతు కంగీకరించి అతనే మనల్ని కలుసుకునేందుకు రావచ్చు. అలా రాని పక్షంలో మనమే మనసు మార్చుకున్నామని చెప్పి, అతనితో మళ్ళీ జట్టు కట్టవచ్చు" అన్నాడు డేవిడ్.

ఇద్దరూ పార్కింగ్‌లో వున్న కారెక్కారు. రాయ

పేటవేపు పోనిచ్చాడు కారు. తారురోడ్డుపైన మెత్తగా జారిపోతున్నాయి టైర్లు. కొంతదూరం పోయాక, జనం పెద్ద గుంపుగా రోడ్డుకు అడ్డంగా నిలుచుని వుండటం గమనించి కారాపాడు డేవిడ్.

“ఏమిటో గొడవ కనుక్కో!” అన్నాడు ప్రక్కనున్న జేమ్స్‌తో.

జేమ్స్ దిగివెళ్ళాడు. ఒకతన్ని పిలిచి “ఏమిటీ హడావుడి?” అడిగాడు.

“సినిమా తార సితార ఈ రోడ్న రాబోతూంది!” అన్నాడతను.

“నడిచి వస్తుందా?” అడిగాడు జేమ్స్.

అవతల వ్యక్తి హేళన చేసినట్లు చూస్తూ “సితార నడిచి వస్తుందా? నీకు పిచ్చా. ఆమె విమానంలో రోడ్డు మీద రాగలదు!” అన్నాడు.

“నాకు తెలీదు! ఏమీ అనుకోకు?” అంటూ ఇంకొంత ముందుకు జనాన్ని తోసుకువెళ్ళి, మొఖాల్ని చకచక పరీక్షగా చూశాడు. రోడ్డు నానుకుని, ఆత్రుతగా చూస్తున్న ఆనందరావు కనిపించాడు.

అంతలో ఓ జీప్ వచ్చింది. అందులో నిండా జనం వున్నారు.

“సితారగారు వస్తున్నారు. కారు మా వెనకనే వుంది. రోడ్డు కడ్డురాకుండా ప్రక్కగా చూడండి” అంటూ మైక్‌లో చెప్పుకుంటూ వెళ్ళిపోయారు.

రెండు నిముషాల తర్వాత పొడవుగా వున్న తెల్ల ఇంపాలా కారు వచ్చింది. అందులో వెనుకసీటులో కూర్చుని, చెయ్యి కిటికీగుండా బైటపెట్టి, వూపుతూ కూర్చుంది సితార. ఆమె చెయ్యితప్ప, మొహం యెవ్వరికీ కనుపించలేదు. కారు చిన్నగా కదలుతూంది.

ఆనందరావు ఆ చెయ్యి తాకేందుకు ప్రయత్నిస్తూ కారు వెంటబడ్డాడు. అడుగులు తడబడి, తలక్రిందుగా పడిపోయాడు.

జనం చుట్టూ చేరారు. కొందరు అతన్ని పైకి లేవనెత్తారు. అందరూ హేళనగా అర్థంపర్థం లేకుండా మాట్లాడసాగారు.

అంతలో జేమ్స్ వచ్చి "ఏమిటి పడిపోయారా?" అడిగాడు.

"అవును. కాలు తడబడింది" అన్నాడు కాస్త వంచి పెడుతూ కాలును, ఆనందరావు.

"అరే నొప్పిగా వుందేమో? డేవిడ్ కారు అక్కడే వుంది. రండి దాంట్లో వెళ్దాం!" అన్నాడు జేమ్స్.

మారు మాట చెప్పకుండా కారువేపు నడిచాడు ఆనందరావు. లోన కూర్చున్నాక జేమ్స్ చెప్పాడు డేవిడ్‌తో జరిగింది.

"ఇంతకూ ఆమె చేతిని తాకావా?" అడిగాడు డేవిడ్.

"ఆఁ! కానీ ముద్దు పెట్టుకుందామని ప్రయత్నం చేశాను."

"అబ్బ! నువ్వు అసాధ్యుడివే! అడ్రసు చెప్పు తీసుకెళ్లి దించుతాను" అన్నాడు డేవిడ్.

ఆనందరావు చెప్పిన గుర్తుల ప్రకారం కారు ముందుకు పోనిచ్చాడు డేవిడ్. ఐదారు మలుపులు తిరిగాక, ఒక కొబ్బరిఆకులతో కప్పిన గుడిసెముందు ఆపమన్నాడు కారు. డేవిడ్ బ్రేక్ వేశాడు.

"అదే నా గది!" అన్నాడు ఆనందరావు.

"ఇంత చిన్న ఇంట్లోనా వుంటున్నావ్?"

"ఏం! పెద్ద ఆలోచనలు చేసేందుకు పనికిరాదనా?"

"కాదు! ఇంతకన్నా మంచిచోట వుండివుంటావను కున్నాను. పోనీలే! నీకు మంచి గది చూడమన్నావా?" అడిగాడు డేవిడ్.

"నువ్వు చూసినదానికి అద్దె ఇచ్చుకోవద్దూ!"

"అద్దె సంగతి నాకొదిలేయ్."

"అద్దె కట్టనవసరం లేకుండా అందరికీ గదులు కుదుర్చు తుంటావా కొంపదీసి" ఆశ్చర్యంగా అడిగాడు ఆనంద రావు.

"అలాగే అనుకో! అయితే వాళ్ళు స్నేహితులయి వుండాలి!" అన్నాడు డేవిడ్.

"ఆ అవసరం నాకు లేదు. ఈ గది బాగానే వుంది!" అన్నాడు ఆనందరావు.

"తలుపుతీసి చూపిస్తే బాగుందీ లేనిదీ చెప్పగలం" అన్నాడు జేమ్స్.

ఆనందరావు తాళం తీశాడు. ముగ్గురూ లోనికి వెళ్ళారు. గదిలో లైటు వెలిగించగానే, కనుపించిన సితార ఫొటోలు చూసి పిచ్చెక్కిపోయింది ఇద్దరికీ. నాలు గైదు దేవదారు పెట్టెలున్నాయి. వాటిని గురించి అడగ నవసరం లేదనిపించింది వాళ్లకు.

"ఎలా వుంది?"

"సితార ఒళ్ళో పడుకుని హాయిగా నిద్రపోతున్న ట్లుంది" అన్నాడు చుట్టూ వున్న బొమ్మలను తదేకంగా చూస్తూ జేమ్స్.

"ఆనందరావుగారూ! ఇక మేం వెళ్తాం. మీ కాలు నొప్పి తగ్గేందుకు రెండ్రోజులు పడుతుందేమో. ఈ వంద రూపాయలుంచండి" అంటూ అందించాడు డేవిడ్.

"అవసరంలేదు!" అన్నాడు ఆనందరావు.

"అదేం! డబ్బేం చేసిందయ్యా పాపం! అవసరానికి వాడుకో. ఆ తర్వాత నీకు డబ్బు రాగానే నా అప్పు తీర్చెయ్యి" అన్నాడు డేవిడ్.

ఆనందరావు మెత్తబడ్డాడా మాటతో. నోటు తీసి జేబులో పెట్టుకున్నాడు.

"మేం వస్తాం!" అంటూ సెలవు పుచ్చుకుని డేవిడ్, జేమ్స్ వెలుపలకు వెళ్ళిపోయారు.

## 5

ఆనందరావుకు సితార చెయ్యికి తన చెయ్యి తగిలి నప్పుడు పుట్టిన విద్యుత్ గుర్తొచ్చింది.

ఆమె వ్రేళ్ళ మృదుత్వం అతన్ని ఆశ్చర్యపరచింది. అంత అందమయిన వేళ్లతో, ఆమె ఎలాంటి పనులు చేస్తుందో ఊహించసాగాడు.

అంతలో డేవిడ్ గుర్తొచ్చాడు. అతన్ని ఇంటిదాకా దిగబెట్టి, ఖర్చుల నిమిత్తం వందరూపాయలిచ్చిన మని షిలో అంత మంచితనం వుండి, పశువులా, నీచమైన కోరిక ఎలా కోరగలిగాడో, ఎంత ఆలోచించినా అతనికి అంతుపట్టలేదు.

అతని పథకం, ఫలించేరోజు దగ్గిర కావచ్చిందని ముందురోజంతా మురిసిపోయాడు. కానీ అది మళ్ళీ మొదటికే రావటం అతనికి చాలా నిరాశ కలిగించింది. అతనికోరికకు ఒప్పుకుంటేనో...అనుకున్నాడో క్షణం. ఆ తర్వాత ప్రేమించి పెళ్ళాడిన సితారను చేచేతులా మరో నీచుడికి అప్పగించినట్లువుతుందని అనుకున్నాడు.

దొరికిన శాస్త్ర ఆధారాన్ని, ముందుచూపు లేకుండా పోగొట్టుకున్నట్లుగా తోచింది ఆనందరావుకు.

అతని బుర్ర ఆలోచనలతో గిర్రున తిరగసాగింది. మాట వరుసకు డేవిడ్ కోరినట్లు ఒప్పుకొని, ఆ తర్వాత అదృష్టం కలిసివచ్చి, ఆమె తనదయితే... అప్పుడు కలిగే అంతస్తు, హోదా, ఆ ఆధారంతో డేవిడ్‌ను దూరంగా వుంచవచ్చునని పించింది. అదే సరయిన మార్గమనిపించింది ఆనందరావుకు.

ఆ ఆలోచన రాగానే అతనికి ఆనందం కలిగింది. తెల్లవారాక వెళ్ళి డేవిడ్‌ను కలుసుకుందామని తీర్మానించుకున్నాడు.

తెలీకుండానే నిద్ర ముంచుకొచ్చింది.

మళ్ళా కళ్ళు తెరిచి చూసేసరికి తెల్లగా తెల్లవారిపోయి వుంది. గబగబ కాలకృత్యాలు ముగించుకున్నాడు. డ్రెస్ చేసుకొని వీధినపడ్డాడు.

కాకా హోటలులోనికి వెళ్ళి రెండు బన్‌లు ఒక టీ ఆర్డరు చేశాడు. వేడి టీలో బన్ రొట్టె ముక్కలు తడుపుకుంటూ తినసాగాడు.

డేవిడ్ అడ్రసు అడగకపోవడం తప్పనిపించింది ఆనందరావుకు. మొదటిసారి కలసిన, ఫోర్ ఆటీన్స్ హోటలుగానీ, రెండోసారి కలుసుకున్న మెరీనాబీచ్ కాని, రాత్రిపూట తప్ప పగలు ఆ ప్రదేశాల్లో మనుష్య సంచారం వుండదు.

టీ తాగడం పూర్తయ్యాక, బిల్లు చెల్లించి వెలుపలకొచ్చాడు. ప్రక్కనున్న బంకులో సిగరెట్లు, అగ్గిపెట్టెలతోపాటు సినిమా పత్రిక కూడా కొన్నాడు. అక్కడే నిలుచుని తిరగెయ్యసాగాడు.

మొదటిపేజీలో పెద్దపెద్ద అక్షరాలతో రాసిన వార్త అతన్ని ఆకర్షించింది. ఆతృతగా చదివాడు. సితార

మరో మూడు రోజుల్లో అమెరికా వెళ్ళబోతూంది. అక్క డ్నుంచి దాదాపు నెలరోజులదాకా తిరిగిరాదు.

ఆనందరావుకు చెమటలు ముంచుకొచ్చాయి. ఆమె అమెరికా వెళ్ళివచ్చిందాకా తన పథకం వాయిదా వేసు కోవడం అసంభవమనిపించింది. ఎలాగైనా డేవిడ్‌ను కలుసుకోవాలనిపించింది. ఎటూ రాత్రిదాకా ఆగాలి కాబట్టి, తిన్నగా గదికి వెళ్ళి, ఆలోచించుకుంటూ కూర్చోవడం మేలనిపించి తిరుగుముఖం పట్టాడు.

మళ్ళా గదికి చేరుకున్నాడు ఆనందరావు. పేపరు చదువుతూ కూర్చున్నాడు.

అరగంట గడిచింది. బైట కారాగిన చప్పుడైంది.

లేచి వెళ్ళి చూశాడు. నల్ల అంబాసిడర్ కనుపించింది. అందులోంచి దిగుతున్న డేవిడ్ కనుపించాడు.

"హల్లో ఎలా వుంది కాలు?" అడిగాడు డేవిడ్.

"బాగానే వుంది! ఏమిటిలా ప్రొద్దున్నే వచ్చారు?". అడిగాడు ఆనందరావు.

"నీ కాలెలా వుందో చూద్దామని" అన్నాడు డేవిడ్'

ఇద్దరూ లోనికి వచ్చి కూర్చున్నారు.

"రాత్రంతా ఆలోచించాను. మీ కోరిక అంత అసమంజసంగా కనుపించలేదు. అందువల్ల, ఒప్పుకోదలచుకున్నాను. ఈ విషయం మీతో చెప్పేందుకు, ఇవాళ రాత్రికి కలుసుకోనే ఉద్దేశంలో వున్నాను. ఇంతలో మీరే వచ్చారు" అన్నాడు ఆనందరావు.

"గుడ్! అయితే ఇంకేం మనం పని ప్రారంభించవచ్చు!" అన్నాడు డేవిడ్.

"మీ ఫ్రెండు రాలేదా?"

"లేదు! అతనుకూడా వుండాలా?"

"అవసరం లేదు!"

"అయితే ఎలా ఎక్కడ ఎప్పుడు మొదలెట్టాలో చెప్పు" అన్నాడు డేవిడ్ తాపీగా కూర్చుని సిగరెట్టు ముట్టిస్తూ.

"మనం ముందు పేర్లు మార్చుకోవాలి. పొరపాటున కూడా ఆమె ముందు మన అసలు పేర్లు పలకకూడదు. ఎందుకంటే, ఆమె మనపైన ఉత్తరోత్తరా పగ తీర్చుకోదలచుకుంటే పోలీసులకు మన వివరాలు చెప్పే అవకాశం ఆమెకు లేకుండా చెయ్యాలి. వీలైనంతవరకూ మన రూపాలు కూడా మార్చుకోవడం మంచిది" అన్నాడు ఆనందరావు.

"కరెక్టు. నువ్వే పేర్లు సెటిల్ చెయ్యి!" అన్నాడు డేవిడ్.

"నన్ను వేణు అని పిలవండి. మీరు గడ్డం పెంచి వున్నారు కాబట్టి మిమ్మల్ని 'యూసఫ్' అంటాము. మీ ఫ్రెండును 'సింగ్' అందాము. ఎలా వుంది?"

"వండర్‌ఫుల్‌గా వుంది. తర్వాత."

"ముందు మీరు చెప్పిన బంగళా చూసివద్దాం. అక్కడికి అవసరమైన సామగ్రి మొత్తం ఈ రాత్రికే చేరుద్దాం. పేపర్లో రాసిన దాని ప్రకారం సితార ఎల్లుండి రాత్రికి అమెరికా వెళ్ళాలి. వెళ్ళిందంటే నెలరోజులు తిరిగిరాదు. అంతదాకా మనం ఆగడం అవివేకం. అందువల్ల ఆమెను ఎల్లుండి ఉదయాన్నే లేవదీసుకువద్దాం. ఏమంటారు?" అడిగాడు ఆనందరావు.

"అమెరికాకు ప్రయాణం పెట్టుకొంది గాబట్టి, తీరా కనుపించకపోతే కంగారెక్కి, పోలీసుల్ని పిలవరూ..." తన అనుమానం వ్యక్తం చేశాడు డేవిడ్.

"ఆమె ఒకచోటకి వెళ్తానని మరో చోటికి వెళ్ళడం, వెళ్ళకుండా ఆగిపోవడం చాలా మామూలు. అలా నాలు గైదుసార్లు చేసింది అందువల్ల ఆమె సెక్రెటరీ, మిగిలిన వాళ్ళూ, ఆమెను యెవరో లేవదీసుకుపోయారని అనుమానించినా ఒకపట్టాన పోలీసుల్ని ఇందులోకి దింపరు. ఆ నమ్మకం నాకుంది" అన్నాడు ఆనందరావు.

"ఆమెను లేవదీసుకు వెళ్ళడం ఎలా?"

"అందుకు సరియిన సమయంవుంది. ప్రతిరోజు ఉదయం ఐదింటికి లేస్తుంది సితార. స్నానం పానం ముగించు కుని, చీకటిగా వున్నప్పుడే, శరీరాన్ని అందంగా వుంచు కోవడం కోసం, మామూలు బ్రా, అండర్ వేర్ లతో, బంగళా దగ్గరనుంచి కాంపౌండ్ గేటుదాకా పది పన్నెండుసార్లు పరుగెత్తుతుంది.

ఆ టైమ్‌లో ఎవ్వరూ ఆమెతో వుండరు. ఆమె వెంట ఒక బొచ్చుకుక్క మాత్రం అరుచుకుంటూ పరుగెత్తు తుంది. కాంపౌండ్ ప్రక్కన పెద్ద మామిడి చెట్టువుంది. ఆ చెట్టు క్రిందకు వచ్చినప్పుడు పైని ఆకుల నీడవల్ల, మసక చీకటిగా వుండటంతో, ఆమె ఎవ్వరికీ కనుపించదు. అదే సరయిన సమయం మనకు." అన్నాడు ఆనందరావు.

"సితార గురించి చాలా వివరాలు సేకరించావే?"

"ఆఁ!ఆమెనూ, కుక్కనూ మనం కారులోకి చేర్చాలి. అంతకు ముందుగానే ఆమెకు క్లోరోఫారం వాసన చూపిం చాలి. కుక్కకు అదే చెయ్యాలి. ఆ తర్వాత అరగంటలో మనం బంగళా చేరుకుంటాము. ఎలావుంది ప్లాను!"

"బాగుంది. కాంపౌండ్ వాల్ కున్న గేటు మూసి వుండవచ్చు. లేదా అక్కడ కాపలాగా గూర్ఖావుండ వచ్చు. మరి దాని విషయం ఏమిటి?"

"కరెక్టు. కాంపౌండు గేటు తూర్పువేపునుంది. దక్షిణంవేపుకూడా కాంపౌండ్ గోడ నానుకొని రోడ్డు వుంది. మనం కారా రోడ్ లో పెట్టాలి. జేమ్స్, నేనూ లోనికి వెళ్తాం. కారు ఇంజన్ ఆన్ చేసి రెడీగా వుండాలి. మేము లోనికి ఎక్కగానే స్టార్టుచేసుకుపోవాలి. మేము ఆమెను గేటుద్వారా తీసుకురాము. గోడ దాటిస్తాం. దాని కవసరమైన ఫోల్డింగ్ లాడర్ ఒకటి మనం సంపాదించుకోవాలి."

"దక్షిణంవేపు రోడ్డు నానుకొని ఇళ్లు లేవా?"

"లేవు! అన్నీ కొండలు, రప్పలు. నరసంచారం వుండదు."

"అయితే మనల్ని యెవ్వరూ చూసే ప్రమాదం లేదన్నమాట!"

"లేదు! కారు జాగ్రత్త కూడా మనం తీసుకోవాలి...!"

"ఏమిటది?"

"కారు నెంబరు గురించి. అది కనుపించకుండా బురద ముందుగా పూసివెయ్యాలి. లేదా ప్లేటు మార్చివెయ్యాలి" అన్నాడు ఆనందరావు.

"నీ బుర్ర చాలా పదును గలది. అన్ని పాయింట్లు ఆలోచించావ్. మన పథకం విజయవంతమౌతుందని నమ్మకం కలుగుతూంది నాకు" అన్నాడు డేవిడ్.

"భగవంతుడి దయ."

"అయితే ఆలస్యం యెందుకు?పని ప్రారంభిద్దామా?" అడిగాడు డేవిడ్ ఉత్సాహంగా.

"నేను రెడీ!" అన్నాడు ఆనందరావు.

ఇద్దరూ వెళ్ళి కారెక్కారు. కారు రివ్వున ముందుకు దూసుకుపోయింది.

# 6

వేకువఝామున నాలుగుగంటలైంది.

కారు 'సితార' వుంటున్న బంగళాప్రక్క దక్షిణం వేపు రోడ్‌లో పెట్టారు. జేమ్స్, ఆనందరావూ ఇద్దరూ, కాంపౌండు గోడ ఎక్కి, లోనికి దూకారు. మామిడి చెట్టు పైకెక్కి కొమ్మల్లో కూర్చున్నారు.

అరగంటపైనే దాటింది.

దూరంగా వున్న బంగళా మేడ పైభాగాన కిటికీ అద్దంలోంచి వున్నట్టుండి వెలుతురు వచ్చింది. ఆనందరావు అది గమనించాడు. 'సితార' నిద్ర లేచి వుండాలని పించింది.

ఆ తర్వాతో అరగంట ఏవిధమైన సందడి కాలేదు.

ఇంతలో వున్నట్టుండి కాంపౌండు గేటుదగ్గరో కారు వచ్చి ఆగింది. రెండుసార్లు హారన్ మ్రోగింది.

జేమ్స్ అర్థంకానట్లు చూశాడు ఆనందరావుకేసి. అతనూ ఆ కారుకేసి చూడసాగాడు.

గేటు తెరచుకుంది. కారు బంగళావేపు వెళ్ళింది. ఐదు నిముషాల్లో మళ్ళీ తిరిగి వెళ్ళిపోయింది. గేటు మళ్ళీ మూసుకు పోయింది.

"ఆ కారెందుకు వచ్చినట్లు?" అడిగాడు జేమ్స్.

"పాలు, కూరలు తెచ్చివుంటుంది" అన్నాడు ఆనంద రావు.

మరో పది నిముషాలు జరిగాయి.

బంగళా క్రిందివేపు పోర్టికోలో లైటు వెలిగింది. ఆ తర్వాతో రెండునిముషాలకు లైట్లక్రింద సితార ప్రత్యక్ష మైంది. ఆమె కాళ్ళవద్ద ఒక బొచ్చుకుక్క తారట్లాడ సాగింది,

అక్కడ్నుంచి చేతులు ఊపుకుంటూ నడకగాని పరుగుతో కాంపౌండు వేపురాసాగింది సితార. ఆమె ఒంటిపైన బ్రా, అండర్ వేరు తప్ప మరేంలేవు. తల వెంట్రుకలు అటూ ఇటూ పడకుండా, గట్టిగా రిబ్బను కట్టివుంది. చెట్టు క్రిందనుంచి గేటుదాకా వెళ్ళింది. అక్కడ్నుంచి మళ్ళా బంగళావేపు పరుగెత్తింది.

"నీ అంచనా కరెక్టుగా వుంది!"

"మాట్లాడకు. ఆమె అలా పదిసార్లు పరుగెత్తుతుంది. మనం ఆఖరిసారి ఆమెను పట్టుకోవాలి. అప్పటికి ఆమె బాగా అలసిపోయి వుంటుంది. పెనుగులాడేందుకూడా ఎక్కువ శక్తి వుండదు. నేను ఆమెను పట్టుకుంటాను. నువ్వు కుక్కను పట్టుకో!" అన్నాడు ఆనందరావు.

అలాగే నన్నట్లు తలూపాడు.

మరోసారి పరుగెత్తుకొచ్చింది సితార. గేటుదగ్గర నుంచి తిరిగి రాబోతూండగా, ఇద్దరూ పైనుంచి దిగి చెట్టు మొదట్లో నిలుచున్నారు.

చెట్టుక్రిందకు రాగానే ఆనందరావు ఆమెను వడిసి పట్టుకుని జేబురుమాలు ముక్కుదగ్గర పెట్టాడు.

జేమ్స్ కుక్కను పట్టుకుని దానికూడా క్లోరోఫాం వాసన చూపించాడు. దానిగొంతు గట్టిగా పిసికి దూరంగా విసిరివేశాడు.

సితార నోటమాట రాకముందే స్పృహతప్పి పడిపోయింది.

ఇద్దరు ఆమెను నిచ్చెన పైగుండా గోడమీదకు చేర్చారు. నిచ్చెనను ఇద్దరూ పైకి లాగి, అవతలివేపు అమర్చారు. ఆమెతో సహా క్రిందకు దిగారు. చిన్నగా ఆమెను కారు వెనుకసీట్లోకి చేర్చారు.

"ఏం గోడవలేదుగా?" అడిగాడు డేవిడ్.

"లేదు!" అన్నాడు జేమ్స్.

"కుక్కపిల్లేది?" అడిగాడు ఆనందరావు.

"గొంతు నులిమి అక్కడే పారేశాను!" అన్నాడు జేమ్స్.

"చెప్పింది వేరు. చేసింది వేరు. వెళ్ళి దాన్ని తీసుకురా?" కోపంగా అన్నాడు ఆనందరావు.

"దాంతో మనకేందుకు? మనకు కావలసింది సితార. చిక్కింది. వెళ్దాం పదండి!" అన్నాడు జేమ్స్.

"అలా కాదు! దాన్ని చూసి వాళ్ళు ఏదో ఘోరం జరిగిందని ఊహిస్తారు. దాన్ని మాయం చెయ్యకపోతే మరో గంటలోనే మనకోసం పోలీసుల వేట ప్రారంభమవుతుంది" అన్నాడు ఆనందరావు.

"అవును. అది నిజం. జేమ్స్ నువ్వెళ్ళి ఆ కుక్కను తీసుకురా" అన్నాడు డేవిడ్.

జేమ్స్ విసుక్కుంటూ వెళ్ళి గోడ పైకెక్కాడు. మెల్లిగా లోనికి దూకాడు.

అంతకుముందు కుక్కను పారేసిన ప్రదేశంలో కెళ్ళి చూశాడు. అక్కడ కుక్కపిల్ల కనుపించలేదు. ఏమయిందాని చూడసాగాడు. ఒకవేళ దానికి మత్తెక్కకపోవటంతో లేచి బంగళాలోకి వెళ్ళిపోయిందేమోనను కున్నాడు. అతనికి అలా జరిగివుండే అవకాశం కనుపించలేదు. దాని గొంతు తనే నులిమాడు గట్టిగా. ఎవ్వరైనా చూశారేమోనన్న భయం కలిగింది.

అక్కడ వుండడానికి అతనికి భయంవేసింది. ఎలాగైనా అక్కడ్నుంచి వెళ్ళి వెలుపలున్న కారు చేరుకోవడం మంచిదనిపించింది. మెల్లిగా గోడ ఎక్కాడు. అదే

సమయం కాంపౌండులో వున్న లైట్లన్నీ వెలిగాయి ఒక్కసారి. భయంతో పైనుంచి క్రిందికి దూకాడు.

అదే సమయంలో కారు కదిలి వెళ్ళిపోయింది వేగంగా.

జేమ్స్ దూకటంలో కాలు మడతబడి, బండరాయిపైన మోకాటి చిప్ప ఆనింది. నరాలు జివ్వుమని లాకాయి. ఎంత ప్రయత్నించినా కాలు స్వాధీనంలోకి రాలేదు.

గోడవారగా పడివుంటే, లోనున్న మనుషులెవరన్నా వచ్చి వెతికితే వాళ్ళకు తను చిక్కిపోయే ప్రమాదం వుంది. అందుకని దొర్లుకుంటూ రోడ్డు దాటి, అవతల వేపున్న తుప్పల్లోకి జారిపోయాడు.

ఒక పెద్ద రాయిని అడ్డుగా పెట్టుకుని మెల్లిగా లేచి కూర్చుని, కాలు స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నం చేశాడు. కాని ఫలితం లేకపోయింది. అప్పటికప్పుడే మోకాటి చిప్ప బాగా వాచిపోయినట్లయింది. నొప్పికూడా యెక్కువైంది. అలాగే కళ్ళు మూసుకుని బండరాయినానుకుని వుండిపోయాడు జేమ్స్.

## 7

“స్పృహ పూర్తిగా తప్పిందా?” ఆక్సిలేటరుపైనున్న కాలును గట్టిగా అదిమిపెట్టి స్టీరింగ్ ముందు కూర్చున్న డేవిడ్ అడిగాడు.

“ఆఁ!” అన్నాడు ఆనందరావు.

“జేమ్స్ వాళ్ళ చేతుల్లో పడిపోయి వుంటాడా?”

“ఏమో? ఉన్నట్లుండి లైట్లన్నీ వెలిగాయి. ఆ కుక్కను అలా వదలవద్దని చెప్పాను. కానీ నా మాటను వినలేదు జేమ్స్” అన్నాడు ఆనందరావు.

కారు ముందుకు దూసుకుపోతూనే వుంది వడిసెల్లు రాయిలా.

"అతను వాళ్ళకు చిక్కితే మన పథకం వాళ్ళతో చెప్పేస్తాడేమో?" అనుమానంగా చూశాడు ఆనంద రావు.

"అలా జరగదు. అతన్ని నిలువునా చీల్చినా, చంపినా నిజం చెప్పడు!" నమ్మకం ధ్వనించింది అతని కంఠంలో.

"నీకా నమ్మకం లేకుంటే మనం ప్లాను మారుద్దాం!"

"ఎలా?"

"ముందనుకున్న చోటికి కాకుండా మరోచోటికి తీసుకెళ్దాం?"

"మరో చోటు చూడాలి గదా? అయినా మనం భయపడనవసరంలేదు. జేమ్స్ ఎలాగైనా తప్పించుకొని వచ్చేస్తాడు. నాకా నమ్మకం వుంది" అన్నాడు డేవిడ్.

ఇద్దరిమధ్యా మరే మాటలూ లేవు. వెనుక సీట్లో పడుకుని వున్న సితారకేసి చూశాడు ఆనందరావు.

ఆమె అందం అంత దగ్గర్నించి చూస్తుంటే అతనికి మతిపోయినట్లయింది. అందులో ఒంటిమీద పెద్దగా బట్టలు లేకపోవటంతో, ఆమెలోని వంపులు, సొంపులు వివరంగా కనుపించసాగాయి. సితారకు తెలివి వచ్చాక, ఆమెతో యేం చెప్పాలో, ఎలా చెప్పాలో, ఆమెకు ఏవిధమైన హాని జరగదని ఎలా నమ్మించాలో, నెమరువేసుకో సాగాడు.

అరగంట ప్రయాణం తర్వాత కారు అనుకున్న ప్రదేశం చేరుకుంది. ఇద్దరూ సాయంపట్టి ఆమెను బెడ్ రూంలోకి చేర్చారు. దానికి ఒకే ఒక తలుపుంది. గది లోనే బాత్ రూమ్ కూడా వుంది. తలుపు బైట రెండు కుర్చీలు వేసుకుని కూర్చున్నారు ఇద్దరూ.

"ఎప్పటికి తెలివొస్తుంది?" అడిగాడు డేవిడ్.

"ఇంకో గంట పట్టవచ్చు" అన్నాడు ఆనందరావు.

"ఈలోగా జేమ్స్ రాగలిగితే బావుణ్ను," అన్నాడు డేవిడ్.

"వస్తే మంచిదే! రాకుంటే మనం ఖచ్చితంగా ప్రమాదంలో చిక్కుకున్నట్లే. నేను ఈమెను చూస్తుంటాను. నువ్వెళ్ళి ఏం జరిగిందో చూసి రాకూడదూ?" అడిగాడు ఆనందరావు.

"అవసరంలేదు. పైగా నువ్వొక్కడివీ ఆమెను కంట్రోలు చెయ్యగలగడం అసాధ్యం! జేమ్స్ గురించి మనం మరచిపోదాం.మనపని మనం నిర్వహించుకుందాం." అన్నాడు డేవిడ్.

ఆనందరావు మాట్లాడకుండా వుండిపోయాడు.

డేవిడ్ ప్రక్క గదిలోంచి ఒక బ్రాంది సీసా, రెండు గ్లాసులూ తెచ్చి పెట్టాడు స్టూలుపైన.

"త్రాగుతావా?" అడిగాడు ఆనందరావును.

"వద్దు. నువ్వూ ఇప్పుడు త్రాగకు."

"ఆమెకు తెలివొచ్చేసరికి వొళ్ళు తేలిక చేసుకోవాలి. నాకు అడ్డు చెప్పకు."అంటూనే బాటిల్ ఓపెన్ చేశాడు.

మెల్లమెల్లగా త్రాగటం మొదలెట్టాడు డేవిడ్. అర్థం వున్నవీ, లేనివీ, ఏవేనా మాటలు అతని పెదాలపైనుంచి దొర్లిపోతున్నాయి.

గదిలోంచి 'సితార' కదలిన చప్పుడవుతుందేమోనని చెవులు రిక్కించి వినసాగాడు ఆనందరావు. అతని గుండె దడదడ లాడుతుంది.

గంట గడిచింది.

లోపల మంచంపైన మనిషి కదలిన చప్పుడైంది. ప్లష్ డోర్ తొలగించి చూశాడు. సితార కదులుతూండటం

కనిపించింది. మెల్లిగా లేచి లోనికి వెళ్ళి, తలుపు మూసి గొళ్ళెం బిగించాడు.

ఆ శబ్దానికి సితార ఠక్కున లేచి కూర్చుంది.

"ఎవరు నువ్వు? నేనెక్కడున్నాను? నన్నెందుకు బంధించారు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

"నా పేరు వేణు. నీ అభిమానిని. ఆరాధకుణ్ణి. నిన్ను నేనే తీసుకొచ్చాను. మనం మద్రాసు మహానగరానికి దూరంగా, ఎవ్వరూ కనిపెట్టలేని ప్రదేశంలో వున్నాం. నావల్ల నీకే విధమైన అపాయం జరగదు. అనవసరంగా భయపడవద్దు!" అంటూ కుర్చీలాక్కుని కూర్చొన్నాడు ఆనందరావు.

"నన్నెందుకు దొంగిలించు కొచ్చావ్?"

"నీ పైన నాకెంత పిచ్చి అభిమానముందో చెప్పటానికి, నువ్వంటే నాకెంత ప్రేమో చూపించటానికి. నిన్ను నిన్నుగా, పవిత్రంగా, ప్రేమించగల మనిషి ఒకడున్నాడని, చూపించటానికి తీసుకొచ్చాను."

"నాన్సెన్స్! నీలాటి వెధవలు లోకంలో వేల మంది వున్నారు. నా కలాంటి వాళ్ళు అవసరంలేదు!" అంది సితార కోపంగా.

"అలా ఆవేశపడకు! ఈ పత్రికలో నువ్విచ్చిన ఇంటర్వ్యూ చదువు. తెలుస్తుంది." అన్నాడు ఆనందరావు ఒక పత్రిక ఆమె కందిస్తూ.

"అదంతా పబ్లిసిటీకోసం నాకు తెలీకుండా, నన్నడగకుండా ఎవరో రాసింది. దాన్ని వదిలివెయ్యి. లేకుంటే నువ్వు ఆజన్మఖైదు అనుభవిస్తావ్?" అంది సితార.

"లాభంలేదు. నీకై నువ్వు పరిస్థితులు అర్థంచేసుకొని మాతో సహకరిస్తే, నీకే విధమైన అపకారం జరగకుండా

చూసి, ఆ తర్వాత నిన్ను నీ యింటికి చేరుస్తాను. లేదంటే..."

"అంటే నీతోపాటు ఇంకా వున్నారా వేరే మనుషులు?"

"ఉన్నారు మరో యిద్దరున్నారు. నీ పొందుకోసం పరితపిస్తున్నారు."

"బలవంతంగా నన్ను రేప్ చేస్తారా?"

"ఆ అవసరం రాకుండా చూసే బాధ్యతనీది. నీ ప్రవర్తననుబట్టి వుంటుంది." అన్నాడు ఆనందరావు.

"నా మనుషులు నా కోసం ఈపాటికి కంగారు పడుతుంటారు. దేశంలోవున్న ప్రతి పోలీసు మీకోసం వెతుకుతూ వుంటాడు. వాళ్ళ చేతుల్లోంచి తప్పించుకుని తిరగడం మీకు వీలుకాదు!" అంది సితార బెదిరిస్తూ.

"నీ మీద కోపంలేదు! ప్రేమవుంది. అది అర్థం చేసుకో చాలు."

వెలుపలనుండి తలుపులు తట్టిన చప్పుడైంది. ఆనందరావు లేచి వెళ్ళాడు. తలుపు తియ్యగానే డేవిడ్ లోనికి వచ్చాడు.

దుప్పటి కప్పుకుని కూర్చున్న సితారను చూసి "ఏమంటుంది రామ చిలుక." అడిగాడు డేవిడ్.

"ఆమెకు పరిస్థితి అర్థమయ్యేలా చెపుతున్నాను," అన్నాడు వేణు.

"అతను నీ తోటి మనిషా?" అడిగింది సితార.

"అవును. పేరు యూసఫ్!" అన్నాడు ఆనందరావు.

"సితారగారూ! నాకు నీ పైన ప్రేమలేదు. కానీ నీ డబ్బు పైన ప్రేమవుంది. ఈ కాగితం తీసుకొని పెన్నుతో నే చెప్పిన విధంగా రాయి. అది చేరాక నాకు

డబ్బు అందుతుంది. ఆ తర్వాత నిన్ను వదిలి పెడతాను, అలాగా నీకు యిష్టముంటే అతనికి ఆనందం అందించు. అయిష్టంగా వుంటే అదీవద్దు!" అన్నాడు యూసఫ్.

"యూసఫ్! మన ఒప్పందం మరచి పోయావా?"

"అప్పటి సంగతి అది. ఇప్పటి విషయం ఇది. నీదారికి నేను అడ్డు రావటంలేదు. నా దారికి నువ్వు అడ్డు రావద్దు అనవసరంగా బాధపడతావ్?" అన్నాడు డేవిడ్.

"నువ్వడిగినట్లు రాసిస్తాను. కానీ నాకో ప్రమాణం చెయ్యాలి!" అంది సితార.

"ఏమిటది?"

"ఆ డబ్బు అందే దాకా నా శరీరం పైన ఎవ్వరూ ఏ అత్యాచారం జరగకుండా చూచే పూచీ నీదిగా వుండాలి. నాకు ఎవ్వరిపైన ప్రేమలేదు. నేను అందరిలో అందంగా వుండాలన్నా, గ్లామరస్‌గా కనుపించాలన్నా ఇది అవసరం. ఏమంటావ్?" అడిగింది సితార ఉత్సాహంగా.

"ఓ. కే. అలాగే!" అన్నాడు యూసఫ్.

"ముందతన్ని బైటకి వెళ్ళమను."

"మిస్టర్ వేణూ! ప్లీజ్ గెటవుట్!" అన్నాడు డేవిడ్.

"నోర్ముయ్!" అన్నాడు ఆనందరావు.

జేబులోంచి పొడవుపాటి కత్తితీశాడు డేవిడ్. దాన్ని అతని ఛాతీకేసి గురిచూపిస్తూ "నడువు వెలుపలకు!" అని గద్దించాడు.

"మనుషులు కాదు మీరు రాక్షసులు! మీలాంటి వాళ్ళతో జట్టు కట్టటం నాదే తప్పు!" అంటూ వెలుపలకు వెళ్లాడు ఆనందరావు.

సితార డేవిడ్ చెప్పినట్లుగా రాసి, కాగితం అందించింది.

"నువ్వు మంచివాడివిలా వున్నావ్. డబ్బెంతపోయినా నాకు బాధలేదు. తిరిగి సులభంగా సంపాదించుకోగలను. కానీ నా అందం మాత్రం చెడకూడదు. అందుకే నువ్వు పదిలక్షలని రాయమంటే నేను పదిహేను లక్షలని రాశాను. ఇది నా సెక్రటరీ కృష్ణమూర్తిగారికి చేర్చాలి. అంత మొత్తం డ్రా చెయ్యగల స్తోమత అతనికే వుంది. అతను వెళ్ళి అడిగితే ఏ బాంకూ అనుమానించకుండా ఇస్తుంది. ఇంట్లో అంత క్యాష్ వుండదుగా," అంది సితార.

"అలాగే!" అన్నాడు డేవిడ్.

"నువ్వు వెళ్ళాక అతను నాపైన అత్యాచారం చేస్తే ఎలా? నాకు రక్షణ కావాలి!" అంది సితార.

"అయితే ఈ కత్తి నీ దగ్గరుంచుకో." అన్నాడు డేవిడ్.

అలాగే అని కత్తి అందుకుంది సితార.

డేవిడ్‌ను పోనిచ్చి తలుపు మూసుకుంది.

ఒకడు వెళ్ళిపోయాడు మరొకడున్నాడు. వాడ్ని బోల్తా కొట్టించడం పెద్ద కష్టం కాదనుకుంది. కాగితం రాయించుకెళ్ళిన మనిషి అడిగి వచ్చేలోగా తను ఇక్కడి మనిషి భరతంపట్టి తప్పించుకోవాలనుకుంది.

అరగంట అలాగే మంచం పైన పడుకుంది.

"సితారా? సితారా?" ఆమె ప్రేమికుడు బైటనుంచి పిలిచాడు.

"ఎవరు?" అంది సితార.

"నేను, వేణును."

"ఏం కావాలి?"

"సీతో మాట్లాడాలి. తలుపుతియ్యి."

"తియ్యను. తీస్తే నువ్వు నన్ను బలవంతంచేసి కోరిక తీర్చుకుంటావని భయంగా వుంది" అంది సితార.

"అలా జరగదు. ఇందాకూరికే భయపెట్టాను. నావల్ల నీకే అపకారం జరగదు. తలుపుతియ్యి" అన్నాడు.

సితార కత్తి జాగ్రత్తగా పట్టుకుని తలుపు తెరచింది. ఆనందరావు లోపలికి రాగానే, ఒక్క దెబ్బన వీపు పైన గ్రుచ్చింది. అలాటి సీనుల్లో చాలాసార్లు నటించి వుండటంతో ఆమె కదేమంత పెద్ద కష్టంగా లేదు.

కత్తి గుచ్చుకోగానే క్రింద కూలిపోయాడు ఆనంద రావు. అదే అదనుగా దుప్పటి కప్పుకునే పరుగెత్తింది. అలా అరగంట పరుగెత్తాక మెయిన్ రోడ్ వచ్చింది.

ఆ తర్వాత గంటకల్లా ఒక టాక్సీలో బంగళా చేరు కుంది.

అప్పటికే జేమ్సును పోలీసులు అరెస్టుచేశారు. కృష్ణ మూర్తికోసం వెతుక్కుంటూ వెళ్ళిన డేవిడ్ను కూడా పట్టుకున్నారు. మూడో మనిషి ఎక్కడున్నదీ చెప్పింది పోలీసులకు సితార.

—: అయిపోయింది :—